## క్లుప్తంగా

### నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**హన్మకొండ:** జాతీయ రహదారి నిర్మాణ పనులు కొనసాగుతున్నందున హసన్‌పర్తిలోని ఎల్లాపూర్ ఇండస్ట్రియల్ ఫీడర్‌లో ఈనెల 24న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగునుందని ఎన్పీడీసీఎల్ హసన్‌పర్తి ఏడీఈ అశోక్ తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

### రేపు చిత్రలేఖనం పోటీలు

**విద్యారణ్యపురి:** గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 25న పాఠశాల, ఇంటర్, డిగ్రీ, పీజీ, డీఎడ్, బీఈడీ విద్యార్థులకు హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని పద్మశ్రీ డాక్టర్ నేరెళ్ల వేణుమాధవ్ ప్రాంగణంలో (ఆడిటోరియం) చిత్రలేఖనం పోటీలు నిర్వహించనున్నట్లు వల్లంపట్ల ఆర్ట్స్ డెవలప్‌మెంట్ అండ్ వెల్ఫేర్ సొసైటీ ప్రధాన కార్యదర్శి మ్యాకల సూరయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు 94401 07543, 97057 58185 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

### అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు యంగ్ సైంటిస్ట్ అవార్డు



**కేయూ క్యాంపస్:** కాకతీయ యూనివర్సిటీ బయోటెక్నాలజీ విభాగం కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ టి.రాధికకు ఉత్తరప్రదేశ్ అలీఘర్‌లోని సొసైటీ ఫర్ ప్లాంట్ రీసెర్చ్ ఆధ్వర్యంలో యంగ్ సైంటిస్ట్ అవార్డు లభించింది. ఈమేరకు ఆమెను వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ మల్లారెడ్డి గురువారం అభినందించారు.

### అనంత్‌కుమార్‌కు బెస్ట్ కార్యదర్శి అవార్డు



**విద్యారణ్యపురి:** సైకిల్ వాకర్స్ అసోసియేషన్ జిల్లా (303) కార్యదర్శి పులివెంట్ల అనంత్‌కుమార్‌కు బెస్ట్ కార్యదర్శి అవార్డు లభించింది. సైకిల్ వాకర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించినందుకు ఇటీవల ఏలూరులో నిర్వహించిన వాకర్స్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్‌లో అనంత్‌కుమార్‌కు అవార్డు అందజేశారు. ఈ మేరకు హనుమకొండలో అనంత్‌కుమార్‌ను గురువారం సన్మానించారు. వాకర్స్ జిల్లా అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, కోశాధికారి రమేష్, బాధ్యులు వేణుగోపాల్, సత్యం, రవి, రాజు, సురేందర్, లక్ష్మయ్య, శేఖర్‌గౌడ్, శంకర్ పాల్గొన్నారు.

### పరాక్రమ్ దివస్

**కేయూ క్యాంపస్:** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) కేయూ శాఖ ఆధ్వర్యంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకుని పరాక్రమ్ దివస్ సందర్భంగా కేయూ నుంచి 2కే రన్‌ను గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి మాచర్ల రాంబాబు, అతిథులుగా హృద్రోగ నిపుణుడు భగీరథ్, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ మేఘన కలిసి 2కే రన్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో ఏబీవీపీ కేయూ అధ్యక్షుడు సాయికుమార్, ఇన్‌చార్జ్ నిమ్మల రాజేష్, విభాగం సంఘటన మంత్రి హర్షవర్ధన్, స్టేట్ వర్కింగ్ కమిటీ సభ్యుడు అంబాల కిరణ్, ఖేల్ భారత్ కన్వీనర్ ప్రశాంత్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పూజ, హరికృష్ణ, జిల్లా కన్వీనర్ సుజిత్, కేయూ సెక్రటరీ శివ తదితరులు పాల్గొన్నారు.

### బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



**వరంగల్ చౌరస్తా:** వరంగల్ రామన్నపేట బాలనగర్ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ఫిబ్రవరి 1నుంచి 6వ తేదీ వరకు జరగనున్న బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్లను రాష్ట్ర అటవీ, దేవాదాయ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ ఆవిష్కరించారు. హనుమకొండలోని మంత్రి నివాసంలో ఆలయ అర్చకులు, ఈఓ గురువారం మర్యాద పూర్వకంగా కలిసి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించారు. కార్యక్రమంలో ఈఓ ఏలపాటి రత్నాకర్ రెడ్డి, చైర్మన్ శ్రీనివాసాచారి, అర్చకుడు శ్రీధరాచారి, ప్రతినిధులు కృష్ణమూర్తి, సంపత్ పాల్గొన్నారు.

### మంత్రిని కలిసిన ఐఎంఏ కార్యవర్గం

**ఎంజీఎం:** వరంగల్ జిల్లా ఐఎంఏ నూతన కార్యవర్గ సభ్యులు గురువారం దేవాదాయ శాఖ మంత్రిని కొండా సురేఖను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పేదలకు ఐఎంఏ అందిస్తున్న ఉచిత వైద్యశిబిరాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షుడు నాగార్జునరెడ్డి, కార్యదర్శి అజిత్, శిరీష్, మన్మోహన్‌రాజ్, నరేశ్‌కుమార్ పాల్గొన్నారు.

### కాంగ్రెస్ నేతలను కలిసిన నాయకులు

**వరంగల్:** ఇందిరాగాంధీ భవన్‌లో గురువారం జరిగిన రాష్ట్ర యువజన కాంగ్రెస్ కార్యవర్గ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జ్‌లు సురభి ద్వివేది, సయ్యద్ ఖలీద్‌ను వరంగల్ జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కొరమి పరమేష్, తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు.

# పదేళ్లుగా నిరుపయోగంగా షెడ్లు

- రూ.50 లక్షలు బూడిదలో పోసిన పన్నీరు
- వ్యాపారులకు కేటాయించని అడ్డాలు



కాజీపేటలో నిరుపయోగంగా మారిన షెడ్లు

**కాజీపేట:** కూరగాయల వ్యాపారం చేసే చిరువ్యాపారుల కోసం రూ.50 లక్షల వ్యయంతో నిర్మించిన షెడ్లు కాజీపేట పట్టణంలో నిరుపయోగంగా మారాయి. ప్రధాన రహదారులపై చిరు వ్యాపారాలు చేస్తూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న వ్యాపారులకు సరైన అడ్డాలు చూపించి ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో మున్సిపల్ శాఖ అధికారులు.. కాజీపేట 63వ డివిజన్ శ్రీవెంకటలక్ష్మి కూరగాయల మార్కెట్ ఆవరణలో పదేళ్ల క్రితం పలు షెడ్లను నిర్మించారు. సరైన అంచనాలు లేకుండా ఇష్టారీతిగా 4 భారీ షెడ్లను నిర్మించారు. అవి ఉపయోగంలోకి రాకుండా వృథాగా ఉండడంతో ప్రభుత్వ నిధులు బూడిదలో పోసిన పన్నీరులా మారాయి.

**పశువులకు ఆవాసంగా..**

అటు కాజీపేట నుంచి బ్రిడ్జి వరకు, ఇటు చౌరస్తా నుంచి మడికొండ వరకు రోడ్లపై వివిధ వ్యాపారాలు చేసుకుంటున్న చిరువ్యాపారుల కోసం ఈ షెడ్ల నిర్మించారు. వాటిని చిరువ్యాపారులకు కేటాయించపోవడంతో అలంకారప్రాయంగా మారాయి. ఇప్పుడు అవి పశువులు, గొర్రెలు, మేకలు, కుక్కలకు ఆవాసంగా మారాయి. వాటితో పాటు జూబ్లీమార్కెట్ ఆవరణలో నిర్మించిన షెడ్లు కూడా ఎందుకు పనికి రాకుండాపోయాయి. ఏడాదికి ఒకసారి దీపావళి పర్వదినాన టపాసులు విక్రయించడానికి మాత్రం ఈ షెడ్లను వినియోగిస్తున్నారు. అధికారులు స్పందించి అలంకారప్రాయంగా మారిన షెడ్లను వినియోగంలోకి తేవడానికి తగిన చర్యలు చేపట్టాలని ప్రజలు కోతున్నారు.

**వినియోగంలోకి తేవాలి**



మార్కెట్ పరిసర ప్రాంతంలో రూ.50 లక్షల వ్యయంతో నిర్మించిన షెడ్లు చాలాకాలంగా నిరుపయోగంగా ఉంటున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

\- ఉడుతల బాబురావు, బాపూజీనగర్

**ఎమ్మెల్యే దృష్టి సారించాలి**



చిరువ్యాపారులతో అధికారులు మాట్లాడి అలంకారప్రాయంగా మారిన షెడ్లను వినియోగంలోకి తీసుకురావడానికి తగు చర్యలు చేపట్టాలి. ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆ దిశగా దృష్టి సారించి సమస్య పరిష్కరానికి కృషి చేయాలి.

\- మహమూద్, కాజీపేట

# అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



హన్మకొండ అర్బన్: దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే, మేయర్, కలెక్టర్ తదితరులు

**హన్మకొండ అర్బన్:** అర్హులైన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం నగరంలోని 60వ డివిజన్‌లో నిర్వహించిన ప్రజాపాలన వార్డు సభలో కలెక్టర్ ప్రావీణ్య, మేయర్ సుధారాణి, కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారుల నుంచి నేరుగా దరఖాస్తులు స్వీకరించారు.

**హన్మకొండ చౌరస్తా:** సంక్షేమ పథకాల అమలుపై అపోహలు వద్దని, అర్హులందరికీ అందించాలన్నదే రేవంత్‌రెడ్డి సర్కార్ లక్ష్యమని ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి అన్నారు. హనుమకొండ 5వ డివిజన్‌లోని కొత్తూరు కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన వార్డు సభలో స్థానిక కార్పొరేటర్ పోతుల శ్రీమన్నారాయణ, నగర మేయర్ గుండు సుధారాణి, మాజీ కార్పొరేటర్ తాడిశెట్టి విద్యాసాగర్ పాల్గొన్నారు.

**కాజీపేట:** ప్రజా సమస్యలు పరిష్కరించడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలంకావడం వల్లే ప్రజాపాలన వార్డుసభలకు జనాలు భారీగా దరఖాస్తులు ఇస్తున్నట్లు ఎమ్మెల్యే నాయిని తెలిపారు. 62వ డివిజన్ సోమిడి ప్రభుత్వ కమ్యూనిటీ హాల్‌లో కార్పొరేటర్లు జక్కుల రవీందర్ యాదవ్, విజయశ్రీ రజాలీ, తహసీల్దార్ భావ్‌సింగ్, డిప్యూటీ కమిషనర్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

**కాజీపేట రూరల్:** అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని ఎమ్మెల్యే అన్నారు. కాజీపేట 48వ డివిజన్ దర్గా గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన వార్డు సభలో కాజీపేట తహసీల్దార్ భావ్‌సింగ్, కార్పొరేటర్ సర్తాజ్‌బేగం, మాజీ కార్పొరేటర్ అబుబక్కర్, తదితరులు పాల్గొన్నారు.

# కార్మికులకు చెందేవరకు విశ్రమించం



మాట్లాడుతున్న ప్రదీప్‌రావు

**వరంగల్:** వరంగల్‌లోని ఆజంజాహి కార్మిక భవన స్థలం కార్మికులకు చెందే వరకూ విశ్రమించేది లేదని బీజేపీ నేత, వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు అన్నారు. కార్మిక భవన స్థల పరిరక్షణ కోసం అఖిలపక్షం ఆధ్వర్యంలో చేపట్టిన లక్ష సంతకాల సేకరణలో భాగంగా లక్ష్మీపురంలోని కూరగాయల మార్కెట్ ప్రాంతంలో కార్యక్రమాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు మాజీ మేయర్ రాజేశ్వర్‌రావు మాట్లాడుతూ 70ఏళ్లగా ఉన్న కార్మిక భవనం వివిధ అంశాలపై కార్మికులకు ఒక నీడలా నిలిచిందని గుర్తుచేశారు. అఖిలపక్ష నేతలతో కలిసి కార్మికులకు ఆ స్థలం చెందే వరకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వన్నాల వెంకటరమణ, రత్నం సతీష్‌షా, నాయకులు పరమేశ్వర్, రంజిత్, రఘునారెడ్డి, వెంకట్‌గౌడ్, కుమార్, మహేష్, మార్టిన్ లూథర్, పరిరక్షణ కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు, లక్ష్మణ్, డాక్టర్ కొణతం కృష్ణ, రవి పాల్గొన్నారు.

## క్రీడలతో పనిఒత్తిడి దూరం

**కాజీపేట రూరల్:** రైల్వే కార్మికుల పనిఒత్తిడిని అధిగమించేందుకు క్రీడలు దోహదపడుతాయని రైల్వే మజ్దూర్ యూనియన్ డిప్యూటీ డివిజన్ సెక్రటరీ, దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ (ఈసీసీఎస్) ప్రెసిడెంట్ చిలుకుస్వామి అన్నారు. కాజీపేట రైల్వే స్టేడియంలో రైల్వే ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్‌ను గురువారం చిలుకుస్వామి టాస్ వేసి ప్రారంభించారు. కార్యక్రమంలో రైల్వే ఇన్‌స్టిట్యూట్ సెక్రటరీ దేవులపల్లి రాఘవేందర్, జాయింట్ సెక్రటరీ ఎం.రాజయ్య, కోశాధికారి గిరిమిట్ల రాజేశ్వర్ రావు, కల్చరల్ ఇన్‌చార్జ్ రఘు, క్రికెట్ ఇన్‌చార్జ్ పి.ప్రశాంత్, రైల్వే సీసీఎస్ డెలిగేట్స్ పాల్గొన్నారు.

# కార్మికులకు వేతనాలు చెల్లించాలి



మాట్లాడుతున్న రాగుల రమేష్

**ఎంజీఎం:** కాకతీయ మెడికల్ కళాశాల హాస్టళ్లలో పనిచేస్తున్న 73 మంది శానిటేషన్, సెక్యూరిటీ గార్డ్స్, స్కావెంజర్స్, సూపర్‌వైజర్లకు ఏడు నెలలుగా చెల్లించాల్సిన వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ డిమాండ్ చేశారు. కేఎంసీలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 20ఏళ్లగా హాస్టళ్లలో పనిచేస్తున్న కార్మికులకు గతంలో మెడికల్ విద్యార్థుల ఫండ్స్‌లో నుంచి వేతనాలు చెల్లించేవారని, 2024 మార్చి నుంచి ఔట్‌సోర్సింగ్‌లోకి మార్చడంతో గత జులై నుంచి ఇప్పటివరకు వేతనాలు ఇవ్వలేదన్నారు. వేతనాలు ఇవ్వకుంటే ఫిబ్రవరి 10నుంచి సమ్మె చేస్తామని హెచ్చరించారు. అనంతరం కేఎంసీ కార్మికుల యూనియన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అల్లం రమేష్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా డి.రాణి, ప్రధాన కార్యదర్శి కె.పరమేష్, కోశాధికారి బి.రాము, ఉపాధ్యక్షులుగా రాజకుమారి, బాబు, రవి, సహాయ కార్యదర్శులుగా కవిత, ప్రశాంత్, రమేష్, కార్యవర్గ సభ్యులుగా రాజేష్, శ్రీనివాస్, అతిక్, సుమన్, వంశీ, రవీందర్, సునీతను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

# కేంద్రం ఆధిపత్యం కోసమే ముసాయిదా



మాట్లాడుతున్న వెంకటనారాయణ

**కేయూ క్యాంపస్:** పాలకుల నిర్లక్ష్యం వలన నిర్వీర్యమైన రాష్ట్ర విశ్వవిద్యాలయాలను పునరుద్ధరించకుండా కేంద్ర ప్రభుత్వం ఆధిపత్యం చెలాయించేందుకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) ఇటీవల ముసాయిదా బిల్లును తీసుకొచ్చిందని, దీన్ని అందరూ వ్యతిరేకించాలని తెలంగాణ ఉద్యమకారుల రాష్ట్ర వేదిక చైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ సూచించారు. కాకతీయ యూనివర్సిటీలో పలువురు విశ్రాంత ప్రొఫెసర్లతో కలిసి గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యూనివర్సిటీలను గాలికి వదిలేసి నిర్లక్ష్యం చేస్తున్నాయని విమర్శించారు. రిటైర్డ్ ప్రొఫెసర్ సారంగపాణి మాట్లాడుతూ యూజీసీ ముసాయిదా బిల్లును విద్యార్థులు, అధ్యాపకులు, విద్యావంతులు, పౌరులు వ్యతిరేకించాలని కోరారు. సమావేశంలో కేయూ రిటైర్డ్ టీచర్స్ అసోసియేషన్ (కుర్తా) జనరల్ సెక్రటరీ ప్రొఫెసర్ వడ్డె రవీందర్, రిటైర్డ్ ఆర్డీఓ జాన్సన్, రిటైర్ ప్రొఫెసర్ రాంరెడ్డి, డాక్టర్ మంద వీరస్వామి, డాక్టర్ సుధాకర్ పాల్గొన్నారు.

# ప్రజాపాలన వార్డు సభల్లో దరఖాస్తుల వెల్లువ

**మడికొండ:** ప్రజాపాలన వార్డు సభల్లో భారీ సంఖ్యలో ప్రజలు దరఖాస్తులు అందజేశారు. 64వ డివిజన్ మడికొండలో గురువారం నిర్వహించిన వార్డు సభలో ప్రజలు భారీగా తరలివచ్చి దరఖాస్తులను అందజేశారు. కార్యక్రమంలో క్లస్టర్ అధికారి శ్రీకాంత్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శివ, వ్యవసాయాధికారి సంతోష్, ఏఈఓ సంధ్య, కార్పొరేటర్ ఆవాల రాధికరెడ్డి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు చిన్న కుమారస్వామి, దిలీప్, రాజ్‌కుమార్, పావని, మాధవి, ఇన్‌స్పెక్టర్ కిషన్, తదితరులు పాల్గొన్నారు.

**55వ డివిజన్‌లో..**

**హసన్‌పర్తి:** 55వ డివిజన్ భీమారంలో గురువారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ జక్కుల రజిత పాల్గొని లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ రోజారాణి, మాజీ కార్పొరేటర్ జక్కుల వెంకటేశ్వర్లు, ఆర్ఐ ఫాజిల్, నాయకులు గడ్డం శివరాం ప్రసాద్, సారంగపాణి, మార్క్ రాజు పాల్గొన్నారు.

**33, 35, 42 డివిజన్లలో..**

**ఖిలా వరంగల్:** మండల పరిధిలో 33, 35, 42వ డివిజన్లలో ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డి, బల్దియా కమిషనర్ అశ్విని తానాజా వాకడే ఆధ్వర్యంలో కార్పొరేటర్లు ముస్కమల్ల అరుణ, సోమిశెట్టి ప్రవీణ్, గుండు చందన, ఇందిరమ్మ కమిటీ నేతృత్వంలో గ్రామసభలు జరిగాయి. ముఖ్యఅతిథిగా వరంగల్ ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డి హాజరై తహసీల్దార్ బండి నాగేశ్వర్ రావుతో కలిసి గ్రామసభను ప్రారంభించారు. కార్యక్రమంలో బల్దియా ఏఈ ముజామిల్ అహ్మద్, కమిటీ సభ్యులు ముష్కమల్ల సుధాకర్, గుండు పూర్ణచందర్, శివకృష్ణ, స్వరూప, సత్యలక్ష్మీ, రాజు, కత్తరశాల వేణు, కోడం శివకృష్ణ పాల్గొన్నారు.



మడికొండ: మాట్లాడుతున్న కార్పొరేటర్ రాధిక

**అధికార పార్టీ నాయకుల పోటాపోటీ**

**వరంగల్ చౌరస్తా:** వరంగల్ 27వ వార్డు సభలో అధికార పార్టీ స్థానిక కార్పొరేటర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు అత్యుత్సాహం ప్రదర్శించారు. గోవిందరాజుల గుట్ట ప్రాంతంలో జరిగిన కార్యక్రమంలో నేను అంటే నేను అన్నట్లుగా డివిజన్ ప్రజల నుంచి పోటాపోటీగా దరఖాస్తులు స్వీకరించారు. దీంతో ఎవరికి ఇవ్వాలో తేల్చుకోలేక ప్రజలు అయోమయానికి గురయ్యారు. చివరికి స్థానిక కార్పొరేటర్ చింతాకుల సునీల్, టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాశ్‌కు దరఖాస్తులను అందజేశారు.

**'ప్రజాపాలనపై వెల్లువెత్తుతున్న ఆగ్రహం'**

**హన్మకొండ:** కాంగ్రెస్ ప్రజాపాలనపై ప్రజాగ్రహం వెల్లువెత్తుతోందని బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు తెలిపారు. రాష్ట్రంలో నయవంచన పాలన సాగుతోందని ఆమె ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ తీరును గ్రామసభల్లో ప్రజలు నిలదీస్తున్నారని తెలిపారు. రేవంత్ ప్రభుత్వం దరఖాస్తులతోనే కాలం వెళ్లదీస్తోందని పేర్కొన్నారు.

**ప్రభుత్వ తీరును ప్రశ్నించిన బీజేపీ నేతలు**

**దేశాయిపేట:** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 13 నెలలు పూర్తవుతున్నా 6 గ్యారంటీల సంగతి ఏంటని బీజేపీ నాయకుడు సముద్రాల పరమేశ్వర్ ప్రశ్నించారు. 21వ డివిజన్‌లోని ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో గురువారం జరిగిన సభలో హాజరైన అధికారులతో బీజేపీ నాయకులు వాగ్వాదానికి దిగారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం 2,327మంది దరఖాస్తు చేసుకుంటే 1,978 మందికి అర్హత వచ్చిందని, ఈక్రమంలో ఎంతమందికి ఇళ్లు ఇస్తున్నారో చెప్పాలని అధికారులను నిలదీశారు. కార్యక్రమంలో పార్టీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, జిల్లా ఉపాధ్యక్షుడు గడల కుమార్, కార్యదర్శి వెంకట్, డివిజన్ నాయకులు కొమాకుల నాగరాజు, కందుకూరి శ్రీనివాస్, సిరిమల్ల తిలక్, కోట సతీశ్, సురేష్, గాదె భిక్షపతి పాల్గొన్నారు.

# క్రీడలతో ఆరోగ్యం, మానసికోల్లాసం



కేయూ క్యాంపస్: పోటీలను ప్రారంభిస్తున్న వీసీ

- కేయూ వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి

**కేయూ క్యాంపస్:** క్రీడలు ఆరోగ్యానికి, మానసిక ఉల్లాసానికి దోహదపడుతాయని కాకతీయ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి అన్నారు. కాకతీయ యూనివర్సిటీలోని క్రీడా మైదానంలో బోధన, బోధనేతర ఉద్యోగులకు వివిధ క్రీడాపోటీలను గురువారం ప్రారంభించారు. క్రికెట్, వాలీబాల్, టెన్నికాయిట్ తదితర పోటీలు జరగనున్నాయి. మహిళల టెన్నికాయిట్ పోటీలను కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి ప్రారంభించారు.

**ఉర్దూ జర్నలిస్టులకు క్రీడా పోటీలు**

**రామన్నపేట:** నిత్యం పనిఒత్తిడిలో ఉండే జర్నలిస్టులకు క్రీడలు మానసిక ఉల్లాసం, శారీరక దృఢత్వానికి ఉపయోగపడతాయని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నేత మహ్మద్ అయూబ్ అన్నారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీయూడబ్ల్యూజేఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి వరంగల్ జిల్లా ఉర్దూ జర్నలిస్టుల క్రీడా పోటీలను ఇస్లామియా కళాశాల ఆవరణలో గురువారం ఆయన ప్రారంభించారు. అధ్యక్షుడు సాజిద్ పాషా, కార్యదర్శి ఎంఏ.నయీం, ఉపాధ్యక్షులు మున్వర్, మాషుక్, అక్తర్ హుస్సేన్, బాబర్, సమ్మద్, మోయిన్, జావిద్, ప్రెస్‌క్లబ్ కార్యవర్గ సభ్యుడు నయీం పాల్గొన్నారు.

# కరీమాబాద్ దర్గాకు గిలాఫ్ సమర్పణ



గిలాఫ్ సమర్పిస్తున్న వినయ్‌భాస్కర్

**హన్మకొండ:** వరంగల్ కరీమాబాద్‌లోని సయ్యద్‌షా జలాలుద్దీన్ ఖాద్రీ జమాలుల్ బహార్ (మషూక్ ఏ రబ్బానీ రహ్మతుల్లా అలై) దర్గాకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు తరఫున హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ గిలాఫ్ సమర్పించారు. ప్రతీ ఏడాదిలాగే ఈసారి కూడా పార్టీ అధ్యక్షుడు కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తరఫున దర్గాకు గిలాఫ్ సమర్పించారు. హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ ఉర్సు ఉత్సవాల్లో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, హైదరాబాద్ నుంచి మైనారిటీ నాయకులు సోహెల్ షేక్ అబ్దుల్లా, గ్రేటర్ వరంగల్ డిప్యూటీ మేయర్ మసూద్ రిజ్వానా, బీఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

# ఔషధాలపై అధ్యయనం చేయాలి



కార్తీక్‌ను సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

**ఖిలా వరంగల్:** ఫార్మ విద్యార్థులు సరికొత్త ఔషధాలపై అధ్యయనం చేయాలని యూఎస్ఏ ఫార్మ ప్రతినిధి డాక్టర్ జంగా కార్తీక్‌యాదవ్ సూచించారు. వరంగల్ ఉర్సుగుట్ట తాళ్ల పద్మావతి ఫార్మసీ కళాశాలలో డైరెక్టర్లు డాక్టర్ తాళ్ల వరుణ్, వైష్ణవి అధ్యక్షతన డ్రగ్ డిస్కవరి అండ్ డెవలప్‌మెంట్ అనే అంశంపై అంతర్జాతీయ సదస్సును గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్తీక్ మాట్లాడుతూ వైద్య రంగంలో వచ్చే మార్పులకు అనుగుణంగా ఫార్మ విద్యార్థులు సిద్ధంగా ఉండాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వర్ రావు, డాక్టర్ సురేందర్, డాక్టర్ జ్యోత్స్న, డాక్టర్ మాధవి, అధ్యాపకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## నేతాజీ జయంతి వేడుకలు

స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలను నగర వ్యాప్తంగా గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

\- సాక్షి నెట్‌వర్క్



సోమిడిలో నేతాజీకి నివాళులర్పిస్తున్న నాయకులు

## సంక్షిప్తంగా

**అమ్మవారిని దర్శించుకున్న ఉన్నతాధికారులు**

**హన్మకొండ కల్చరల్:** భద్రకాళి దేవాలయాన్ని తెలంగాణ ప్రభుత్వ విద్యాశాఖ స్పెషల్ సెక్రటరీ హరిత, హెల్త్ డైరెక్టర్ హైమావతి గురువారం సందర్శించి అమ్మవారికి పూజలు చేశారు.

**ప్రభుత్వ కార్యాలయాల్లో అంబేడ్కర్ చిత్రపటాన్ని ప్రదర్శించాలి**

**హన్మకొండ:** భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలను ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రదర్శించాలని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు రౌతు రమేష్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈమేరకు హనుమకొండ కలెక్టరేట్‌లో కార్యాలయ అధికారికి గురువారం వినతిపత్రం అందించారు. సామాజిక ఉద్యమకారుడు, రిటైర్డ్ విద్యుత్ ఉద్యోగి డీఎస్.ప్రభాకర్, మాజీ సర్పంచ్ పుల్ల రవి, అంబేడ్కర్ వాదులు సాదు కుమారస్వామి, రాజు పాల్గొన్నారు.

**విద్యుత్ ఆర్టిజన్ల సమస్యలు పరిష్కరించాలి**

**హన్మకొండ:** విద్యుత్ ఆర్టిజన్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని విద్యుత్ ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోషియేషన్ ఎన్పీడీసీఎల్ కంపెనీ కార్యదర్శి అజ్మీర శ్రీరాంనాయక్ డిమాండ్ చేశారు. హనుమకొండ పెద్దమ్మగడ్డలోని ట్రాన్స్‌కో వరంగల్ జోనల్ కార్యాలయం వద్ద విద్యుత్ ఆర్టిజన్ కన్వర్షన్ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం నాలుగో రోజుకు చేరుకున్నాయి. దీక్షలకు శ్రీరాంనాయక్ సంఘీభావం తెలిపి మాటాడారు.

**30న బీసీ విద్యార్థుల సమర శంఖారావం**

**కేయూ క్యాంపస్:** హైదరాబాద్‌లోని ఇందిరాపార్కులో ఈనెల 30న నిర్వహించనున్న బీసీ విద్యార్థుల సమర శంఖారావాన్ని విజయవంతం చేయాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆరెగంటి నాగరాజు పిలుపునిచ్చారు.

**బీసీలకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలి**

**ఖిలా వరంగల్:** చట్టసభల్లో బీసీలకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలని బీసీ మేధావుల వేదిక వ్యవస్థాపక సభ్యుడు, అసిస్టెంట్ ప్రొఫెసర్ వీరస్వామి డిమాండ్ చేశారు. వరంగల్ శంభునిపేటలోని ఏకే ఫంక్షన్ హాల్‌లో బీసీ మేధావుల వేదిక ఆధ్వర్యంలో ధర్మపురి రాజగోవింద్ అధ్యక్షతన బీసీల రాజకీయ వాటాపై గురువారం చర్చాసభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 2న జరగనున్న బీసీ మేధావుల వేదిక, బీసీ రాజకీయ విజయ భేరి సభను విజయవంతం చేయాలని కోరారు.

**స్వయం పాలన దినోత్సవం**

**హసన్‌పర్తి:** హసన్‌పర్తిలోని నేతాజీ శిశుమందిర్‌లో స్వయం పాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల వేషధారణలో విద్యార్థులు సహా విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులను సన్మానించారు. తొలుత విద్యార్థులు జాతీయ నాయకుల వేషధారణలో భారీ ర్యాలీ నిర్వహించారు.

**కాలుష్యంతో మానవ జీవితం ప్రమాదకరం**

**హసన్‌పర్తి:** కాలుష్యం వల్ల మానవ జీవితం ప్రమాదంలో చిక్కుకుందని సంగారెడ్డి ఎస్పీ రూపేష్ అన్నారు. హసన్‌పర్తి మండల కేంద్రంలోని సుజాత విద్యానికేతన్ పాఠశాలలో స్టీల్ బ్యాంక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ మిత్ర యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పర్యావరణ రహిత కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడానికి స్టీల్ బ్యాంక్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.

**రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలి**

**హసన్‌పర్తి:** ఈనెల 25వ తేదీన ఎర్రగట్టు క్రాస్‌లోని వేంకటేశ్వరస్వామి కల్యాణ మండపంలో నిర్వహించతలపెట్టిన రాజ్యాంగ పరిరక్షణ సదస్సును విజయవంతం చేయాలని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్ పిలుపునిచ్చారు. ఈమేరకు సదస్సును విజయవంతం చేయాలని కోరుతూ దేవన్నపేటలో గురువారం కరపత్రాలు విడుదల చేశారు.

**అధ్యయనోత్సవాలు ప్రారంభం**

**కాజీపేట:** కాజీపేట 61వ డివిజన్ చైతన్యపురి కాలనీలోని గోదాదేవి, పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో మూడు రోజులపాటు జరగనున్న అధ్యయనోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. శ్రీనివాసాచార్యులు పర్యవేక్షణలో సమ్మక్వారు వారి పల్లకీసేవ, పరమ పదోత్సవం, తులసి మాలల పూజలు అర్చకులు జరిపించారు.

**టీఎన్‌జీవోస్ కాలనీ కమిటీ ఎన్నిక**

**మడికొండ:** మడికొండలోని టీఎన్‌జీవోస్ కాలనీ అయోధ్యపురం రోడ్డు ఫేజ్ -2 నూతన కమిటీని గురువారం ఎన్నుకున్నారు. కాలనీ కమిటీ అధ్యక్షుడిగా రిటైర్డ్ తహసీల్దార్ లింగాల సూరిబాబు, ఉపాధ్యక్షుడిగా కాసగోని శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా బాదావత్ రాము, జాయింట్ సెక్రటరీగా శోభన బోయిన రామచందర్, కోశాధికారిగా కల్లూరి సందీప్, సభ్యులుగా బొల్లెడ నారాయణరెడ్డి, బొల్లికొండ రామకృష్ణ, గంగారపు త్రివేణి, సంకేపల్లి అరుణ ఎన్నికయ్యారు.

**కాజీపేటలో ర్యాలీ**

**కాజీపేట:** కాజీపేటలో మాదిగ మహాజనుల వేదిక ఆధ్వర్యంలో ఎస్సీల వర్గీకరణకు మద్దతుగా గురువారం భారీ ర్యాలీ నిర్వహించారు. మంద కృష్ణమాదిగ పిలుపు మేరకు ఫిబ్రవరి 7న జరగనున్న లక్ష డప్పులు.. వేల గొంతుల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గబ్బెట శ్రీనివాస్ పిలుపునిచ్చారు.

**యువతిని వేధిస్తున్న యువకుడిపై కేసు**

**మడికొండ:** ప్రేమించాలని వేధిస్తూ వెంటపడుతున్న ఓ యువకుడిపై కేసు నమోదు చేసినట్లు మడికొండ ఇన్‌స్పెక్టర్ కిషన్ తెలిపారు. కాజీపేట మండలం రాంపేట గ్రామానికి చెందిన బొజ్జు రాజ్‌కుమార్ కొద్ది రోజులుగా అదే గ్రామానికి చెందిన ఓ యువతిని ప్రేమించాలని, లేకుంటే చంపుతానని రెండేళ్లుగా బెదిరిస్తున్నాడు. తరాలపల్లిలోని తన స్నేహితురాలిని కలిసేందుకు ఆ యువతి గురువారం వెళ్తుండగా అడ్డగించి చెయ్యిపట్టి లాగగా ఆమె గట్టిగా అరవడంతో వదిలి పారిపోయాడు. ఈమేరకు యువతి తల్లిదండ్రులు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

**ఇసుక తరలిస్తున్న వ్యక్తిపై కేసు**

**మడికొండ:** అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ కిషన్ తెలిపారు. కడిపికొండ జీపీ వద్ద ఇసుక ట్రాక్టర్‌ను పోలీసులు సీజ్ చేసి, జఫర్‌గఢ్ మండలం కోనాచలం గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ తాటికాయల బాబును అదుపులోకి తీసుకున్నారు.

**విద్యార్థులపై చేయి చేసుకున్న హోంగార్డు**

**ఖిలా వరంగల్:** ఇంటి ప్రాంగణంలో పెంచిన చెరుకు మొక్కను విరిచి తీసుకెళ్లిన విద్యార్థులను ఓ హోంగార్డు కొట్టిన సంఘటన మధ్యకోటలోని బాలికల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం మధ్యకోటలో ఓ హోంగార్డు తన ఇంట్లో చెరుకు మొక్కను ముగ్గురు విద్యార్థులు తలాఒక్కటి తెచ్చుకున్నారు. దాంతో ఆవేశానికి గురైన హోంగార్డు.. పాఠశాల ప్రాంగణంలోకి వచ్చి విద్యార్థులను కొట్టాడు. హోంగార్డుపై మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌లో విద్యార్థుల తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడమే కాకుండా అతనిపై చేయి చేసుకున్నట్లు తెలిసింది.

**తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ**

**ఖిలా వరంగల్:** ఇంటికి తాళం వేసి దైవ దర్శనానికి వెళ్లగా ఇంట్లోకి గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి బీరువాలోని తులం బంగారం, సుమారు 25 తులాల కాళ్ల వెండి పట్టీలు అపహరించుకుపోయారు. ఈ సంఘటన కరీమాబాద్ బీరన్న గుడిసెవాసుల కాలనీలో గురువారం వెలుగులోకి వచ్చింది. ముక్కెర రమేష్ కుటుంబ సమేతంగా సోమవారం ఉదయం ఇంటికి తాళం వేసి దైవ దర్శనానికి వెళ్లారు. గురువారం వచ్చి చూసేసరికే తలుపు తాళం ధ్వంసమై కనిపించింది. ఈమేరకు బాధితుడు రమేష్ ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.